# ప్రజాశక్తి

సోమవారం 9 సెప్టెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# జలమయం

- ◆ విశాఖ, అనకాపల్లిల్లో ఎడతెరిపిలేని వర్షం
- ◆ ఇళ్లలోకి చేరిన నీరు
- ◆ రామకృష్ణనగర్‌లో విరిగిపడ్డ కొండచరియలు
- ◆ బిక్కుబిక్కుమంటున్న కొండవాలు ప్రాంతాల ప్రజలు
- ◆ పలుచోట్ల నీట మునిగిన వరి
- ◆ అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ◆ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి ప్రతినిధి

శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో విశాఖ, అనకాపల్లి జిల్లాలు జలమయమయ్యాయి. విశాఖ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. గోపాలపట్నం సమీపాన ఉన్న రామకృష్ణనగర్‌లో కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతం సహా కొండవాలు ప్రాంతాల్లోని వారంతా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు అప్రమత్తమై కొందరిని పునరావాస కేంద్రాలకు ఇప్పటికే తరలించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలను రద్దు చేశారు. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల వరి పంట నీటమునిగింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షంతో విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. జ్ఞానాపురం, చావులమదుం, పాత పోస్ట్ ఆఫీస్, ప్రసాద్ గార్డెన్స్, పోర్ట్ నుంచి పాత బస్టాండ్ వరకు ఉన్న బౌరాడ రోడ్డు, డాల్ఫిన్ జంక్షన్ నుంచి పూర్ణా మార్కెట్ వైపు వెళ్లే 70 అడుగుల రోడ్డు, అలాగే ఫిషింగ్ హార్బర్ ప్రాంతాలు జలమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చావులమధుం వద్ద మొల లోతు నీరు రావడంతో ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేసి, వేరే వైపు మళ్ళించారు. ఈ పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యే సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ నియోజవర్గంలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి పరిస్థితిని అంచనా వేశారు. ప్రజలను అప్రమత్తం చేశారు. కంచరపాలెం వద్ద రైల్వేకి చెందిన పెద్ద గోడ మిగతా 2లో..

విశాఖ వన్‌టౌన్ ఏరియాలోకి భారీగా చేరిన నీరు

కొండవాలు ప్రాంతంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న కుటుంబం

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని సమీక్షిస్తున్న మేయర్, అధికారులు

చోడవరం బాలాజీ నగర్‌లో ఇళ్ల మధ్యలోకి చేరిన వర్షపునీరు

## ఆందోళనకరంగా జలాశయాలు

వార్త 2లో..

## అవగాహనతో ఆత్మహత్యలను నివారించవచ్చు

వార్త 5లో..

## జివిఎంసి సర్వసభ్య సమావేశం రద్దు

వార్త 2లో..

## గరికిపాటి రాజారావుకు ఘన నివాళి

వార్త 4లో..

# 'ఉక్కు'ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

**నేటి ఢిల్లీ సమావేశంలో ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలి**

**స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్**

మాట్లాడుతున్న అయోధ్యరామ్, చిత్రంలో రామస్వామి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిచేలా సోమవారం ఢిల్లీలో జరగనున్న ఉక్కు మంత్రిత్వ శాఖ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామితో కలిసి ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించి, ప్లాంట్‌ను దెబ్బతీయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కర్మాగారంలో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉండగా ఒకటి మాత్రమే పని చేసేలా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమని అన్నారు. దీనిని గుర్తించి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడిచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను 45 రోజులలో పునరుద్ధరిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి మిగతా 2లో..

# దూర విద్య అందించడంలో సఫలీకృతం

- ◆ ఈ ఏడాది మరిన్ని కొత్త కోర్సులు
- ◆ 'ప్రజాశక్తి'తో ఇగ్నో ప్రాంతీయ కార్యాలయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖపట్నం కేంద్రంగా వేలాది మంది విద్యార్థులకు దూర విద్యను అందించడంలో సఫలీకృతమయ్యామని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయ సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. ఈ నేపథ్యంలోనే గత ఏడాది విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కార్యాలయానికి జాతీయ ఉత్తమ ప్రాంతీయ కార్యాలయంగా విశేష గుర్తింపు దక్కిందన్నారు. తమ వర్సిటీకి చెందిన పలు విషయాలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**ఇటీవల నూతన అధ్యయన కేంద్రాలు ఎక్కడైనా ఏర్పాటు చేశారా ?**

ఇటీవల విశాఖపట్నం గవర్నమెంట్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో నూతన అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాం. ప్రస్తుతం విశాఖపట్నంలో 5, శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల్లో 7 వెరసి 12 కేంద్రాలు నడుస్తున్నాయి.

**ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెడుతున్న కోర్సుల వివరాలు తెలపండి?**

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించి ఎంఎ జ్యోతిష్యం,

ఎంఎ భగవద్గీత, ఎంఎ వాస్తు శాస్త్రం, ఎంఎ హిందూ స్టడీస్ కోర్సులను, ఎంబిఎ విద్యార్థుల కోసం హాస్పిటాలిటీ అండ్ హెల్త్ కేర్ కోర్సును, అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ కోర్సును బిఇ, బిటెక్ విద్యార్థుల కోసం కనస్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### దూర విద్య అందించడంలో సఫలీకృతం

కోర్సులను ప్రారంభిస్తున్నాం. ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, కెమిస్ట్రీ, ఎనలెటికల్ కెమిస్ట్రీ కోర్సులను నెల రోజుల్లో ప్రారంభించనున్నాం. అగ్నివీర్ సహా ఇతర ఉద్యోగాల కోసం నూతన కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

**ప్రస్తుతం రీజియన్ పరిధిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు ? బోధనా వివరాలేంటి ?**

ప్రతి సెమిస్టర్‌కు రెండు వేల మంది విద్యార్థులు మా సంస్థ ద్వారా విద్యను అభ్యసిస్తున్నారు. 2024 ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ వరకూ గడువు ఉంది. బోధనా తరగతులను రీజనల్ సెంటర్ నుంచే ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నాం. ఇటీవల ఏడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించాం.

### 'ఉక్కు'ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

రెండు మాసాల క్రితం ప్లాంట్‌ను సందర్శించిన సమయంలో చెప్పారని గుర్తుచేశారు. ఆయన వెంట ఉక్కు సహాయ మంత్రి, మన రాష్ట్రానికి చెందిన శ్రీనివాస్ వర్మ కూడా ఉన్నారన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయన్నారు. ప్లాంట్ అగాథంలోకి నెట్టబడుతోందన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా ప్రస్తుతం 5 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోందన్నారు. గతంలో కూడా ఒక ఫర్నేస్‌ను మూసివేసి, ఉత్పత్తిని తగ్గించి ప్లాంటుకు నష్టాలు చూపిస్తూ యాజమాన్యం నివేదిక పంపిందని గుర్తు చేశారు. పనిచేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ఫర్నేష్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అందుకు బొగ్గు, ఐరన్ ఓర్ అవసరమన్నారు. ప్రభుత్వ సంస్థలైన సెయిల్, ఎన్ఎండిసి, కోల్ ఇండియా వద్ద బొగ్గు, ఐరన్ ఓర్ కావలసినంత ఉందన్నారు. కొంత కాలం పాటు రా మెటీరియల్‌ను ప్లాంట్‌కు సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా కృషి చేయడం లేదన్నారు. ప్లాంట్‌ను అమ్మివేయాలన్న తలంపుతో రా మెటీరియల్‌ను సరఫరా చేసేందుకుగానీ, వర్కింగ్ క్యాపిటల్‌ను ఇచ్చేందుకుగానీ, కనీసం బ్యాంకులు నుంచి అప్పులు తీసుకునేందుకు ఎల్ఓసి (లెటర్ ఆఫ్ కంఫర్ట్) ఇచ్చేందుకుగానీ సిద్ధంగా లేదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది ఉపాధి పొందుతున్నారని, వారంతా మోడీ సర్కారు తీరుతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే రాస్తారోకోలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### జలమయం

(మొదటి పేజీ తరువాయి..) భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో గోడను ఆనుకొని పార్కింగ్ చేసిన ఒక కారు, రెండు మోటారు బైకులు, ఆటో దెబ్బతిన్నాయి. మద్దిలపాలెం, కెఆర్ఎం.కాలనీ, చైతన్య నగర్, కృష్ణా కాలేజీ రోడ్, అంజయ్య నగర్, చినవాల్తేరులలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మద్దిలపాలెం బస్ స్టేషన్‌లోకి భారీగా వర్షపునీరు చేరింది.

**వర్షపాతం ఇలా..**

గడిచిన 24 గంటల్లో విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా సగటున 60.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా భీమిలిలో 87 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా పెందుర్తిలో 42.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శని, ఆదివారం కురిసిన వర్షాలతో అనకాపల్లి జిల్లాలో సగటు వర్షపాతం 74 మిల్లీమీటర్లుగా నమోదైంది.

**సైక్లోన్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు**

ప్రజల సహాయార్థం విశాఖపట్నం కలెక్టరేట్, పోలీసు కంట్రోల్ రూంలతో పాటు పలు తహశీల్దార్ కార్యాలయాల్లో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 0891-2590102, 0891-2590100, పోలీసు కంట్రోల్ రూమ్ 0891-2565454, డయల్ - 100, డయల్ - 112, ఆనందపురం తహశీల్దార్ కార్యాలయం 9700501860, భీమిలి తహశీల్దార్ కార్యాలయం 9703888838, పద్మనాభం తహశీల్దార్ కార్యాలయం 9866772740, చినగదిలి తహశీల్దార్ కార్యాలయం 9703124082 , పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం 7702577311, సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం, మహారాణిపేట తహశీల్దార్ కార్యాలయం 9182807140, గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం 7842717183, ములగాడ తహశీల్దార్ కార్యాలయం 9440552007, గాజువాక తహశీల్దార్ కార్యాలయం 8886471113, పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయం 9948821997 నెంబర్లతో పనిచేస్తాయి. ప్రజలు అవసరంరీత్యా వీటిని సంప్రదించవచ్చునని అధికారులు తెలిపారు.

అనకాపల్లి కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్ భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ 08924-226599, 08924-222888 నెంబర్లతో పనిచేస్తుంది. అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ 9491998293, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ 7075356563 పనిచేయనున్నాయి.

**అప్రమత్తంగా ఉన్నాం : జివిఎంసి కమిషనర్**

అప్రమత్తంగా ఉన్నామని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఇప్పటికే జివిఎంసి పరిధిలో అన్ని జోన్లలో 80 పునరావాస కేంద్రాలను 10 వేలా 620 మంది ప్రజలకు ఏర్పాటు చేశామన్నారు. 14 వేలా 630 కుటుంబాలను గుర్తించి అప్రమత్తం చేశామన్నారు.

జోన్ 8లోగల 91వ వార్డులో రామకృష్ణనగర్ ప్రాంతంలో ఖాళీ స్థలానికి అనుకొని ఉన్న రిటైనింగ్ వాల్ జారిపడినందున ఆపైన ఉన్న ఐదు కుటుంబాలు సహా సమీపంలోనున్న 20 కుటుంబాలను ఖాళీ చేయించి లక్ష్మీ నగర్‌లోగల మండల ప్రజా పరిషత్ స్కూల్‌లో పునరావాసం కల్పించామన్నారు. వారికి భోజన సదుపాయాన్ని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు ఏర్పాటు చేశామన్నారు.

# ఆందోళనకరంగా జలాశయాలు

**పనిచేయని కోనాం రెండు గేట్లు**
**అప్రమత్తమైన నీటిపారుదలశాఖాధికారులు**

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాలు ఆందోళనకరంగా మారాయి. కొంతకాలంగా నిర్వహణ లేకపోవడంతో రానున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నీటిపారుదల శాఖాధికారులు అవస్థలు పడుతున్నారు. కోనాంకు వరదనీరు పోటెత్తడంతో గేటు ఎత్తివేసి నీరు విడిచిపెట్టారు. వరదనీటి ప్రవాహాన్ని బట్టి ఆదివారం రాత్రి ఏ సమయంలోనైనా మిగిలిన జలాశయాల నుంచి నీరు విడిచిపెట్టవచ్చని నీటిపారుదల శాఖాధికారులు చెప్పారు. జలాశయ నీటిమట్టాలను పరిశీలించి ఏ క్షణంలోనైనా నీరు విడిచిపెట్టడానికి సిద్ధపడేలా పెద్దేరు, రైవాడ, తాండవ జలాశయాల వద్ద నీటిపారుదల శాఖాధికారులు వున్నారు. గత ప్రభుత్వ కాలంలో కోనాం జలాశయ నిర్వహణ లేకపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. మూడు గేట్లకుగాను ఒక గేటు పనిచేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో గేట్లు ఎత్తివేయాలన్నా రెండు గేట్లు పనిచేయకపోవడంతో నీటిపారుదల శాఖాధికారులు అప్రమత్తమై ప్రమాద తీవ్రతను తగ్గించే ప్రయత్నంలో వున్నారు. తాండవ జలాశయ రోప్ దెబ్బతినడంతో నీటిపారుదలశాఖ ఉద్యోగులు చేతి డబ్బులు దాదాపు 70 వేలు ఖర్చుపెట్టి రోప్ ఏర్పాటు చేశారు. గేట్లు ఎత్తడానికి తలెత్తే ఇబ్బందులను గుర్తించి ఈ పనులు చేపట్టారు. ఆదివారం నాటికి పంట నష్టం నమోదు కాలేదు. వరదనీరు భారీగా చేరుతుండడంతో జలాశయాల పరిస్థితి ఆందోళనకరంగా వుంది. ఆదివారం తాండవలో 826 క్యూసెక్కులు, రైవాడలో 2,260, కోనాంలో 300, వరహాలో 150, పెద్దేరులో 380 క్యూసెక్కుల నీరు చేరింది. తాండవ నుంచి 1238, కోనాం నుంచి 1400, వరహా నుంచి 150 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టారు.

**లోతట్టు ప్రాంతాలు జలమయం**

జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు నీటమయమయ్యాయి. కాలువ నుంచి నీరు వెళ్లలేక ఇళ్లల్లోకి చేరింది. చోడవరంలోని బాలాజీనగర్‌లో కాలువల నీరుపారక వీధుల్లో నీరు చేరి ఇళ్లల్లోకి వెళ్లింది. కొప్పాక వద్ద కాలువ వద్ద జాతీయ రహదారిపై నీరు చేరడంతో ద్విచక్రవాహన ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. అనకాపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద నీరుచేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**జిల్లాలో జలాశయాల నీటి నిల్వలు**

| జలాశయం | పూర్తి సామర్థ్యం | ప్రస్తుత నిల్వ | గతేడాది నీరు |
|---|---|---|---|
| తాండవ | 380.00 | 378.20 | 363.20 (అడుగుల్లో) |
| రైవాడ | 114.00 | 110.95 | 109.00 (మీటర్లలో) |
| కోనాం | 101.25 | 98.30 | 94.00 (మీటర్లలో) |
| పెద్దేరు | 137.00 | 136.00 | 134.10 (మీటర్లలో) |
| వరహా | 460.00 | 459.00 | 449.80 (అడుగుల్లో) |

### జివిఎంసి సర్వసభ్య సమావేశం రద్దు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ మంగళవారం జరగాల్సిన జివిఎంసి సర్వసభ్య సమావేశాన్ని రద్దు చేశామని, తదుపరి నిర్వహణ తేదీని మరలా తెలియజేస్తామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు గత మంగళవారం నుండి నిర్విరామంగా సహాయక చర్యలలో పాల్గొని ప్రజలకు సేవలు అందిస్తున్నారని, మరొక 4, 5 రోజులు ఈ సహాయక చర్యలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో 10వ తేదీన జరుగనున్న జివిఎంసి సర్వసభ్య సమావేశాన్ని చేశామని పేర్కొన్నారు.

### కేన్సర్ నియంత్రణలో చైతన్య స్రవంతి సేవలు ప్రశంసనీయం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** మహిళల్లో గర్భాశయ కేన్సర్ నియంత్రణకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎవిఎన్ కాలేజీ ఎదురుగా 37వ వార్డు సచివాలయంలో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం నిర్వహించిన ది హ్యూమన్ పాపిలోమా వైరస్ నియంత్రణ కేన్సర్ వ్యాక్సిన్ బూస్టర్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన కేన్సర్ వ్యాధి నివారణకు చైతన్య స్రవంతి ముందుకు రావడం ముదావహమని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. కెజిహెచ్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి, సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏరియా బిజినెస్ మేనేజర్ బి.రాం రతన్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రుకియా భాను, విజయకుమారి, అనసూయ, రోజా, సిహెచ్.లక్ష్మి, దేవి, లక్ష్మి పాల్గొన్నారు. 45 మంది బాలికలకు వ్యాక్సిన్ వేశారు.

### జర్నలిస్టుల పిల్లలకు త్వరలో హెచ్‌పివి వ్యాక్సిన్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ జిల్లాలో జర్నలిస్టుల కుటుంబాల్లోని 9 నుంచి 14 ఏళ్లలోపు ఆడపిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్లను ఉచితంగా వేసేందుకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రెహమాన్ ముందుకు వచ్చారు. సుమారు రూ.4 వేల విలువగల ఈ వ్యాక్సిన్‌ను రెండు డోసుల్లో తొలి దశలో 50 మంది ఆడపిల్లలకు ఈ క్రమంలో వేయనున్నారు. ఆడపిల్లలు పెద్దయ్యాక గర్భాశయ కేన్సర్ నియంత్రణకు ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ క్రమంలో ఆసక్తిగల జర్నలిస్టులు తమ పిల్లల వివరాలను 9849147350, 9848291749 నెంబర్లకు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా యూనిట్ ఒక ప్రకటనలో ఆదివారం కోరింది.

**మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**E.A.2/2024 in O.S.155/2023**

**బిట్వీన్:**
జగన్నాథం తర్నియ్య . . . పిటిషనరు/DHr
**అండ్:**
కండిపిల్లి మంగతాయారు మరియు మరియొకరు . . . రెస్పాండెంట్లు/J.Drs

**1,2 J.Drsకు ఆర్డర్ 21రూల్ 54 నోటీస్**

1. కండిపిల్లి మంగతాయారు, భర్త లక్ష్మి డల్లారావు, హిందూ, డో.నెం.9-70, డి.బి.కాలనీ, సత్యనారాయణపురం విలేజ్, అనకాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.
2. కండిపిల్లి లక్ష్మి డల్లారావు, తండ్రి తాలీలు, హిందూ, డో.నెం.9-70, డి.బి.కాలనీ, సత్యనారాయణపురం విలేజ్, అనకాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు ఇ.పి.2/2024లో శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:20-9-2024దికి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు ఇ.పి. తీర్మాణించబడును.

**గుబ్బల పరదేశి**
అడ్వకేట్, అనకాపల్లి.
సెల్: 99481 96264

**IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**O.S 361/2023**

**Between**
Canara Bank Adarshnagar Branch Rep by Branch manager **...Plaintiff**
**and**
Koya Surya Prakash**...Defendant**

**SUMMON**

**Koya Surya Prakash**
S/o satyanarayana, aged 36 years Hindu Residing at Flat No. 403, Annapuma Arcade, Prahaladapuram, Gopalapatnam (Rural) Visakhapatnam.

Please take summons That The above OS 361/2023 posted to for your appearance on **Dt.01-10-2024** at about **10:30AM.** Before The Honourable court in Person or Through your advocate. filing which the matter will be decided exparte.

**(By court order)**
**P.NAGINI,**
**Aduocate for Plaintiff**
**Visakhapatnam**

**NOTICE UNDER SECTION 13 (1) (ia) & (b) OF HINDU MARRIAGE ACT. IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE : AT NARASIPATNAM**
**H.M.O.P No.38/2023**

**BETWEEN :**
Karakata Chinnaraju **...Petitioner**
**AND:**
Karakata Kumari **...Respondent**
**To,**
**Karakata Kumari,** W/o Chinnaraju, C/o Pilla Apparao S/o Gangayya, R/o Lampakalova village, North Kanchi Post, Prathipadu village and Mandal, also R/o C/o Nakka Devathamma w/o Late Perayya, Donkada village, Nakkapalli Mandal, Anakapalli District. (Aadhar No.5039 7547 0886).

**NOTICE TO RESPONDENT**

Please take notice that the above H.M.O.P petition filed the petitioner seeking for decree of divorce by dissolving the marriage between petitioner and you dt.24.05.1999 and for such other relief or reliefs and the notices of this court was not served so you are hereby directed to appear before the court may approach this court in person or through an Advocate and file necessary Proof of your claim on **20.09.2024 at 10.30 A.M,** failing which the matter will be decided as exparte.

**By Order of The Court**
**Kosuru Appalanaidu**
**Advocate**
**Tamaram Village**
**Makavarapalem Mandal.**
**Cell : 9440412788**
**Narsipatnam.**
**Date:08.09.2024.**

**మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S.347 / 2023**

**Between:**
Boddeda Seshu . . . Plaintiff
**And:**
Palla Venkata Ramana . . . Defendant

**To**
**Defendant :**
Palla Venkata Ramana,
S/o. Appa Rao, Residing at
Flat No. 302, Murali Residency,
D.No. 39-5-32, Sector-5,
Murali Nagar, Visakhapatnam.

**నోటీస్**

పై నెంబరు దావా ప్లయింటులో కోరిన ప్రకారం డిక్రీ యిప్పించకోరి వాది, ప్రతివాదిపై పై నెంబరును దావాదాఖలు చేసిరి. సదరు దావాలో ప్రతివాదికి Suit Summons కొరకు తే: 24-9-2024దీకి వాయిదా కలదు. కావున ఏమయిన ఆక్షేపణలున్నచో పై కోర్టులో **తే: 24-9-2024దీని ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తెలుపకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మాణించడమగునని యిందుమూలంగా తెలుపడమైనది.

**REDNAM DURGA PRASAD**
Advocate for Plaintiff
D.No. 3-27, Poosanta Street,
Kasimkota Village & Mandal
Anakapalli
Cell : 9849506151
అనకాపల్లి.
తే:6-9-24

# విశాఖలో ఎడతెరిపిలేని వర్షం

## పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ నగరంలో శనివారం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండ వాలు ప్రాంతాల్లో కింద మట్టి కరిగిపోతుండటంతో ఇళ్లలో నివాసముంటున్న ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారు.

**తగరపువలస** : జివిఎంసి రెండో వార్డు సబ్బివానివీధి, ఎఎస్ఆర్.నగర్‌కు ఆనుకుని ఉన్న అండర్ పాత్ వే రెండు వైపులా వర్షపు నీరు నదిలా ప్రవహిస్తోంది. దీంతో స్థానికుల రాకపోకలు ఇబ్బందిగా మారాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖ నుంచి వచ్చే, నగరానికి వెళ్లే ఆర్‌టిసి బస్సులు, కార్లు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. సహజంగా ఇది పల్లపు ప్రాంతం కావడం, దీనికి తోడు హైవే నిర్మాణం, విస్తరణ సమయంలో దొర్లిన కొన్ని సాంకేతిక పరమైన తప్పిదాలతో వర్షపు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తిందని చెప్పక తప్పదు. పల్లపు ప్రాంతాలైన సబ్బివానివీధి, అల్లూరి సీతారామరాజు కాలనీ తది తర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై ప్రవహించే నీరు బయటకు వెళ్లేలా శాస్త్రీయంగా కాల్వల నిర్మాణం జరగలేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. జివిఎంసి, రెవెన్యూ, నీటిపారుదల, హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

**ఎమ్మెల్యే గంటా పర్యటన**

జివిఎంసి రెండో వార్డు పరిధి సబ్బివానివీధి, సంగివలస అండర్ పాత్ ప్రాంతంలో ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, తహశీల్దార్ పి.రామారావు తదితరులు పరిశీలించారు. సంగివలస, కొండపు చెరువులోకి రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు వెళ్లడం తో చెరువు కింద ఉన్న పల్లపు ప్రాంతం అల్లూరి సీతారామరాజుకాలనీ వాసులు ముంపునకు గురవుతామేమోనన్న ఆందోళన ఉందని స్థానికులు వాపోయారు. చెరువుకు ఆనుకుని ఉన్న చప్టా ఎత్తు తగ్గిస్తే వర్షపు నీరు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**అధికారుల పర్యటన..**

జివిఎంసి రెండో వార్డు సబ్బి వీధి, మండలంలోని మూలకుద్దు, టి.నగరపాలెం గ్రామాల్లో తహశీల్దార్ పి.రామారావు, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, సిబ్బంది పర్యటించారు

**భీమిలిలో 87.0 ఎంఎం వర్షపాతం**

**భీమునిపట్నం** : జిల్లాలోఅత్యధికం భీమిలి మండలంలో 87.0 మిల్లీ మీటర్ల వర్ష పాతం ఆదివారం నమోదైంది. భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

**కూలిన ఆనందపురం హైస్కూల్ గోడ**

**ఆనందపురం** : వర్షాల కారణంగా ఆనందపురం హై స్కూల్ ఉత్తరం వైపు ప్రహరీ గోడ ఆదివారం కూలిపోయింది. గోడ పక్కనే పార్కింగ్ చేసి ఉంచిన గండి సుధీర్‌కు చెందిన బైక్, గండి సౌజన్యకు చెందిన స్కూటీ, గొలగాన రాములుకు చెందిన రిక్షా ధ్వంసం అయ్యాయి. ప్రహరీ మట్టి దిబ్బలు పడి భూలోకమాత బిసి కాలనీలోని ఈగల ఎల్లమ్మ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన గంటా, అధికారులు**

కూలిన ఆనందపురం హైస్కూల్ ప్రహరీ ప్రాంతాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపిడిఒ లవరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ పట్నాయక్, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

**నిండిన గంభీరం జలాశయం**

ఆనందపురం మండలంలో ఉన్న గంభీరం రిజర్వాయర్ పూర్తిగా నిండిపోయింది. ప్రస్తుతం రిజర్వాయర్ ప్రమాదకరంగా లేదని, కాలువల ద్వారా నీరు బయటకు వెళ్తోందని విఆర్ఒ దేవరాజ్, విఆర్ఎ ఆనంద్ చెప్పారు. రిజర్వాయర్ సమీపంలో ఉన్న లోతట్టు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రిజర్వాయర్ సందర్శనకు ఎవరూ రాకూడదని ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

**చెరువులను తలపిస్తున్న రోడ్లు**

కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఆనందపురం పంచాయతీ దొంతల వారి కల్లాలు రోడ్డు శిథిలం కావడంతో రోడ్డుపైన నీరు చేరింది. యువకులు స్వచ్ఛందంగా రోడ్డుపై నిలిచిన నీటిని శ్రమదానంతో బయటకు పంపించే ఏర్పాటు చేస్తున్నారు.

**గొట్టిపల్లి కల్లాల్లో నివాసాల మధ్య నీరు**

**ఆనందపురం** : ఆనందపురం మండలం బంటుపల్లి వారి కల్లాల పంచాయతీ పరిధి గొట్టిపల్లికల్లాలలో కల్వర్టు మూసివేయడంతో నివాసాల మధ్య నీరు చేరి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గొట్టిపల్లి కల్లాల పరిసర ప్రాంతాలలో నీరు సమీపంలోని బీపీ కల్లాల బందకు పోతుండేది. ఇటీవల రియల్ ఎస్టేట్ దారులు నీరు పోయే కల్వర్టును పూడ్చివేసి చదును చేయడంతో గ్రామాలు, పొలాల నుంచి వచ్చే నీరు పోవడానికి మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోయింది.

ఆనందపురం మండలం బంటుపల్లి వారి పంచాయతీ పరిధిలో జట్లమ్మ కొండకు అనుసంధానంగా ఉన్న వర్షాధార గెడ్డ వాగును కొంతమంది ఆక్రమణకు పాల్పడటంతో నీరు పోవడానికి మార్గం లేక రోడ్డుపైనే ప్రవహిస్తోంది. జట్లమ్మ కొండ నుంచి వచ్చే వర్షపు నీరు శుభశ్రీ ఫంక్షన్ హాల్ నుంచి చెరువులకు అనుసంధానంగా ఉన్న గెడ్డవాగును కొందరు కప్పేసి అక్రమ కట్టడాలు చేపట్టడంతో వర్షపు నీరు రోడ్డు పైనే నిలిచిపోతుంది.

**ఆనందపురం** : మండలంలోని బోని గ్రామాన్ని తహశీల్దార్ శ్యాం ప్రసాద్ ఆదివారంసందర్శించారు. గ్రామ పరిసరాల్లో గోస్తనీ నది ప్రవాహాన్ని పరిశీలించారు. మరో మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, తాటిపూడి జలాశయం 3 గేట్లు వదిలితే గ్రామంలోకి నీరు వచ్చే అవకాశము ఉందని, గ్రామస్తులు నీటి ప్రవాహాన్ని సందర్శించవద్దని చెప్పారు. గ్రామంలో రెవెన్యూ, పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

హనుమంతువాక జాతీయ రహదారిలో పడిన కొండరాయి

**నీట మునిగిన వరి**

**ఆనందపురం** : వర్షాలకు ఆనందపురం మండలంలో వందలాది ఎకరాల్లో వంట ముంపునకు గురైంది. మండలంలోని బోని, కుసులవాడ ఆనందపురం పొడుగు పాలెం, ముచ్చర్ల బాకురుపాలెం, చర్లపాలెం, పేకేరు, గొట్టిపల్లి తదితర ప్రాంతాలలో రైతులు వరి నాట్లు వేశారు. నాట్లు నాటి 30 రోజులు దాటితేనే నష్టం కింద నమోదు చేస్తామనడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉన్నాయని సోమవారం గ్రామాలలో పర్యటించి పంటల నష్టాన్ని అంచనా వేస్తామని వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. దెబ్బ తిన్న పొలాలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు

**భీమునిపట్నం** : కురుస్తున్న వర్షాలకు భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా. భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు, ఆనందపురం మండలం బోని, పెద్ది పాలెం, వేముల వలస గ్రామాల్లో, పద్మనాభం మండలం బిఆర్.తాళ్లవలస, కోరాడ తదితర గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. ఆయా పంట పొలాలను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కె.అప్పలస్వామి, ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి విజయ ప్రసాద్ పరిశీలించారు.

పద్మనాభం మండలంలో ముంపునకు గురైన వరి పొలాలు

**ప్రమాద స్థాయిలో తాటిపూడి రిజర్వాయర్**

**పద్మనాభం** : తాటిపూడి రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 297 అడుగులకు గాను ప్రస్తుతం 294.4 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా ఏ క్షణమైనా గేట్లు ఎత్తే పరిస్థితి రావచ్చని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలియజేశారు. విఆర్ఒ, విఆర్ఎలు వరద ప్రభావిత గ్రామాలలో లోతట్టు ప్రాంత ప్రజలను అలర్ట్ చేస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ ఆనంద్ కుమార్ ఆదేశించారు.

**విక.పాలెంలో 100 ఎకరాల్లో వరి మునక**

**పద్మనాభం** : మండలంలోని విక.పాలెం గ్రామానికి చెందిన బాందేవపురం రెవెన్యూ పరిధి పద్మనాభరాజు చెరువుకు దిగినవున్న సుమారు 100 ఎకరాల్లో వరి నాట్లు ముంపునకు గురైనట్లు రైతులు బి.కృష్ణ, బి.శంకర్, బి.సూరినాయుడు, జి.శ్రీను, జి.సూరి, ఎస్.పైడిశెట్టి, బి.ఆదినారాయణ తెలిపారు. ఏటా పంటను ఇలానే నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**కొండవాలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ల పర్యటన**

**భీమునిపట్నం** : జివిఎంసి మూడో వార్డు పరిధి నేరెళ్లవలస కాలనీ, ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ సమీపంలోని కాలనీ, బొడ్డోడు గెడ్డ, తోట వీధి ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పర్యటించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. విజయనగరం జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్ గేట్లు ఏ క్షణంలోనైనా ఎత్తి వేసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. జెడ్పీ వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**అంతటా అప్రమత్తం...**

భారీగా వర్షాలు కురుస్తుండడంతో రెవెన్యూ, జివిఎంసి, మండల పరిషత్, మత్స్యశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ సాధారణ నీటి మట్టం కంటే ఎక్కువ నీరు చేరడంతో ఇప్పటికే నీటిని విడుదల చేశారు. దీంతో జివిఎంసి నాల్గో వార్డు చేపలుప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెం గ్రామాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. విజయనగరం జిల్లా తాటిపూడి రిజర్వాయర్‌లో సాధారణ నీటి మట్టం కంటే ఎక్కువ నీరు చేరడంతో గేట్లు ఎత్తి వేసే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో గోస్తనీకి ఆనుకుని ఉన్న ఆనందపురం మండలం బోని, విలాస్ ఖాన్ పాలెం, మూడో వార్డు తోట వీధి, భీమిలి మండలంలోని మూలకుద్దు ప్రజలను అప్రమత్తం చేశారు.

**గాజువాక** : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండవాలు ప్రాంతాల్లో గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు ఆదివారం పర్యటించారు. ఎత్తులో ఉన్న వారు కొండ దిగాలని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గాజువాక జోనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని తెలిపారు.

**గంగవరంలో కూలిన పైకప్పు**

**గాజువాక** : గంగవరం బడివీధిలో ఉన్న ఉమ్మడి ధనం ఇంటి పైకప్పు ఆదివారం కూలింది. అప్పటికి ఆమె పక్కింట్లో ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. 71వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్‌లో ఇళ్లపు కుమారి, ఎం.రాజుకు ఇంటి ప్రహరీ కూలిపోయింది.

**జాతీయరహదారిపై జారిపడ్డ బండ**

**ఆరిలోవ** : హనుమంతువాక కొండ వాలు నుంచి శనివారం సాయంత్రం పెద్ద బండరాయి జాతీయ రహదారిపై పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జాతీయరహదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. వర్షాల కారణంగా ఎక్కడ బండలు జారిపడతాయోనని స్థానికులు, వాహనదారులు భయపడుతున్నారు.

## నేరాలు ఘోరాలు

### చోరీకి పాల్పడిన మహిళ అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్ నుంచి చోరీకి పాల్పడిన మరో మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నేరవిభాగపు ఎసిపి వెంకటరావు తెలిపారు. ఆదివారం పిఎం.పాలెం స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఎం.సీతారామలక్ష్మి ఈనెల 6వ తేదీన ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పిఎం పాలెం వచ్చేందుకు ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో ముగ్గురు మహిళలు ప్రయాణిస్తున్నారు. సీతారామలక్ష్మి బ్యాగ్‌లో అరున్నర తులాలు బంగారంతో పాటు రూ.50 వేలు నగదు ఉన్నాయి. ఆ ఆటోలో ఉన్న మాడుగులకు చెందిన గాది సత్యవతి బ్యాగులోని వస్తువులను దొంగిలించి ఆటో దిగిపోయింది. సీతారామలక్ష్మి ఇంటికి వచ్చి చూసేసరికి వస్తువులు లేకపోవడంతో పిఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితురాలు సత్యవతిని అరెస్ట్ చేశారు. వస్తువులను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేశారు. నిందితురాలు సత్యవతిపై గతంలో అనకాపల్లిలో అనేక కేసులు ఉన్నట్లు ఎసిపి తెలిపారు. ఈ సమావేశంలో నేర విభాగం సిఐ బివిఎస్ఎన్.ప్రకాష్, ఎస్ఐ డి.ప్రసాద్, హెచ్‌సి మూర్తి, హాసీనా బేగం, నాగరాజు, మల్లిక్, వైభవ్ పాల్గొన్నారు.

### చోరీ కేసులో యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3న ద్వారకా క్రైమ్ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఆ కేసు వివరాలను ఈస్ట్ ఎసిపి వెంకటరావు ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సీతమ్మధార సమీపంలోని ఎపిఎస్ఇబి కాలనీలో ఉంటున్న కొండ్రు ఉదయలక్ష్మి ఏసీ రిపేర్ నిమిత్తం పూర్ణా మార్కెట్ రంగిరీజు వీధికి చెందిన నందవరపు చాణక్యను సంప్రదించింది. సరిగ్గా ఆమె లేనిసమయంలో చాణక్య ఆ ఇంటికి వెళ్లాడు. తన వద్ద ఉన్న స్క్రూ డ్రైవరుతో తలుపు విరగ్గొట్టాడు. అక్కడ ఉన్న ట్రావెల్ బ్యాగ్ జిప్ ఓపెన్ చేసి అందులో ఉన్న బంగారు వస్తువులు దొంగిలించాడు. అదే రోజున ఎంవిపి క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఉదయలక్ష్మి ఫిర్యాదు చేసింది. చాణక్యను పోలీసులు తమదైన పద్ధతిలో విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. అతని వద్దనున్న సుమారు రూ.2 లక్షలా 12 వేల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని రిమాండ్‌కు పంపించారు. ముద్దాయి రుషికొండ దగ్గరగల గాయత్రి కాలేజ్‌లో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మీడియా సమావేశంలో డివిజన్ క్రైమ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

### బైకులు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కొత్తకోట:రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన రావికమతం మండలం మత్స్యవానిపాలెం గ్రామ సమీపంలో మొదమాంబ కాటా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దిపల్లి రామరాజు, మచ్చా రాము నాయుడులు ద్విచక్ర వాహనంపై కొత్తకోట నుండి అర్జా పురం వెళు తుండగా ఇదే గ్రామానికి చెందిన కోసిరెడ్డి సువర్ణ రాజు మరో వాహనం పై ఎదురుగా వస్తూ ఒకరినొకరు బలంగా ఢీ కొట్టుకున్నారు. ఈ ఘటనలో అద్దిపల్లి రామరాజు కు బలమైన గాయాలు కాగా ఆయన వెనుక ఉన్న మచ్చా రామానాయుడు, సువర్ణ రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సహకారంతో ముగ్గురిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అద్దిపల్లి రామరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. రామరాజు మృతదేహానికి పోస్ట్ మార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు హెచ్చరించారు. మండలంలోని గునిపూడి శివారులో ఆదివారం అక్రమంగా రవాణా చేస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించారు. మండలంలో అడ్డుఅదుపు లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఉక్కు పాదం మోపుతున్నారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇప్పటికే రెండు పర్యాయాలు దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 4 టిప్పర్లు ,జెసిబిని సీజ్ చేసి జరిమానా విధించారు. అయినప్పటికీ తీర ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు.ఈ సందర్భంగా సిఐ, ఎస్ ఐ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

## 'సురా' సాహిత్య సేవా పురస్కారాలు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ప్రముఖ సంఘసేవకుడు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యుడు, 'సురా' బాబాయ్ (పేరిచర్ల సుబ్బరాజు) పేరుతో నెలకొల్పబడిన 'సురా సాహిత్య సామాజిక సేవా పురస్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెక్ట్ర చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ, కుల, మత వ్యత్యాసాలకు, సామాజిక రుగ్మతలకు, చేతబడి, బాణామతి, వాస్తు, జ్యోతిష్యం తదితర మూఢ విశ్వాసాల నిర్మూలనపై పోరాడిన మానవతావాది సురా బాబాయ్ అని కొనియాడారు. 'మరణించినా... జీవించండి' అన్న నినాదంతో ప్రారంభించిన శరీర అవయవదాతల సంఘానికి వ్యవస్థాపక సభ్యుడుగా ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడు అన్నారు. ఆయన స్ఫూర్తి చరిత్రలో చిరస్మరణీయం అయ్యేందుకు 'సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారాన్ని' వారి కుటుంబం నెలకొల్పిందని వివరించారు. సమాజంలో వివిధ రంగాలలో నిస్వార్థ సేవలు అందిస్తున్న వారికి ఏటా సెప్టెంబర్ నెలలో ఈ స్మారక అవార్డుతోపాటు రూ.25వేల నగదు పురస్కారం అందజేస్తున్నారు. ఈ ఏడాది అవార్డును తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ భారతికి అందజేసినట్లు గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు.

**అవార్డు స్వీకరించిన ప్రముఖులు**

2019లో ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహ్మద్, 2020లో ప్రముఖ ప్రజావాగ్గేయకారుడు డప్పు రమేష్, 2021లో ప్రముఖ సాహిత్య - సామాజికవేత్త అనిశెట్టి రజిత, 2022లో ప్రముఖ సంఘ సేవకులు 'బొమ్మరిల్లు', 'జాబిల్లి' ఆశ్రమ నిర్వాహకులు పి.రాజ్యలక్ష్మి, 2023లో ప్రముఖ రక్తదాన ఉద్యమకారుడు, 999 రక్తదాన క్యాంపులు, 70 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించిన వి.వినోద్‌బాబుకు అందజేశారు.

నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎపి ఎస్‌బిఐబిఎ సభ్యులు

## వరద బాధితులకు నిత్యావసరాలు

**ప్రజాశక్తి-సీతమ్మధార** విజయవాడ వరద బాధితుల సహాయం నిమిత్తం వైజాగ్, విజయనగరం బ్రాంచ్ విద్యుత్ అధికారులు బియ్యం, పప్పు, ఆయిల్, బిస్కెట్లు, నిత్యావసర వస్తువులను అందజేసినట్లు సంస్థ ప్రతినిధి ఎడిఇ కోటేశ్వరరావు తెలిపారు. మొత్తం 1400 ప్యాకెట్లు అందజేసినట్లు చెప్పారు.

## డిసిసి అధ్యక్షునిగా వర్మ రాజు

**ప్రజాశక్తి- భీమునిపట్నం :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా భీమిలికి చెందిన అడ్డాల వెంకటవర్మరాజును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పోటీ చేసిన విషయం విదితమే. డిసిసి అధ్యక్షునిగా నియమించినందుకు ఎపిపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## జూడో పోటీలకు విద్యార్థులు

**ప్రజాశక్తి-ఆనందపురం :** చెన్నైలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు జరగబోయే జూడో పోటీలకు ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలోని శ్రీ వెంకట విద్యాపీఠ్ విద్యార్థులు ఆదివారం బయలుదేరారు. ఇటీవల రాష్ట్ర జూడో క్రీడా సంఘం సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పాండ్రంకి రుష్మాకరరావు ఆధ్వర్యాన ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో ఛాంపియన్ షిప్ బాలికల ఎంపికలు నిర్వహించారు. చెన్నైలో జరిగే పోటీలకు బయలుదేరిన విద్యార్థులకు శ్రీ వెంకట్ విద్యా పీఠ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వరరావు, చీఫ్ కోచ్ లెంక అప్పలరాము, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జూడో పోటీలకు బయలుదేరుతున్న విద్యార్థులు

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు...

# రేపటి రాస్తారోకోను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**ఉక్కునగరం :** కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే రాస్తారోకోను విజయవంతం చేయాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 1305వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతూ మరింత ఆందోళనగా మారిందన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలు పట్ల వారి విధానం మారలేదని అర్థమవుతుందన్నారు. కేంద్ర స్టీల్ మంత్రి, సహాయ మంత్రి స్టీల్ ప్లాంట్‌కు వచ్చిన సందర్భంగా 45 రోజులలో ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని, మోడీని ఒప్పిస్తామని ప్రకటించి వెళ్లినా, ఆ దిశగా చర్యలేవని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించాలని రాష్ట్ర కార్మిక, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయని, దీనికి మద్దతుగా విశాఖ ఉక్కు కార్మిక వర్గం కూడా ఉదయం 11 నుంచి 12:30 గంటల వరకు కూర్మన్నపాలెం, గాజువాక జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించాలని పోరాట కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, ఒవి.రావు, నమ్మి రమణ పాల్గొన్నారు.

**రాస్తారోకోకు ఎఐవైఎఫ్ మద్దతు**

**గాజువాక :** ఈ నెల 10న తలపెట్టిన రాస్తారోకోకు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) పూర్తి మద్దతు తెలుపుతుందని విశాఖ జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం పనిచేయడం లేదని, ఉక్కును మరింత నష్టాల ఊబిలోకి నెట్టి అదానికి కట్టబెట్టడానికి విశ్వప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

**విశాఖలో రౌండ్ టేబుల్ సమావేశం**

**విశాఖ కలెక్టరేట్ :** స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉక్కు రక్షణ కోసం ఈ నెల 10న రాస్తారోకోలు జరుగనున్నాయని, ఈ నేపథ్యంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్దగల జెఎసి దీక్షా శిబిరం నుండి ప్రదర్శన చేపట్టి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రాస్తారోకో చేపట్టాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. ప్లాంట్ పరిరక్షణకు కేంద్రంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేసింది. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి పైడిరాజు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.సూరీడు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు జి.అప్పలరాజు, కెజె.అప్పారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.పోలేశ్వరరావు, డివైఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్ సంఘాల నాయకులు కె.సంతోష్ కుమార్, కె.కుమారి, ఎం.సుబ్బన్న, పెన్షనర్ల సంఘం నాయకులు ఎం.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

**అనకాపల్లి :** విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 10న చేపట్టనున్న రాస్తారోకో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు, ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. దొరబాబు, వైఎన్.భద్రం, ఏఐఎఫ్‌టియు కార్యదర్శి కే.మోహన్ ఐఎఫ్టియు నాయకులు రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1300 రోజులుగా కేంద్ర కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ఇప్పటికే స్టీల్‌ప్లాంట్‌లోని రెండు బ్లాస్ట్ ఫర్నేసులు ఉత్పత్తిని నిలిపివేశాయని పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని బిజెపి కుట్రలను అందరూ తిప్పి కొట్టాలని కోరారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇచ్చినట్లయితే ప్రభుత్వానికి తిరిగి కోట్ల రూపాయల డబ్బులు చెల్లిస్తుందని, అటువంటి స్టీల్‌ప్లాంట్‌ని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 10న జరుగు రాస్తారోకోలో కార్మికులు ప్రజలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దీక్షలో కూర్చున్న కాంట్రాక్టు కార్మికులు

# గరికిపాటి రాజారావుకు ఘన నివాళి

డాక్టర్ రాజారావుకు నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు గరికిపాటి రాజారావు 61వ వర్ధంతిని ఆరిలోవ బిఎన్ఆర్‌నగర్‌లో ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ముందుగా రాజారావు చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు వై.అప్పారావు, సూర్యనారాయణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వక్తలు వై.అప్పారావు, సూర్యనారాయణ, చంటి, వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ప్రజా సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగించే అనేక కళారూపాలు నిర్మించారని కొనియాడారు. ఒకవైపు వైద్యునిగా సేవలందిస్తూ మరో వైపు సమాజానికి పట్టిన రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని తెలిపారు. భూమి నాటకం ద్వారా ప్రజలు, కార్మిక, రైతాంగ వర్గాల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారన్నారు. ఎంతో మందిని సినీ రంగానికి పరిచయం చేశారని గుర్తుచేశారు. ఇటువంటి మహనీయుల బాటలో మనమందరం నడవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, నారాయణరావు, లక్ష్మణరావు, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నవీన్‌కు ఎక్సలెన్స్ ఇన్ స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ అవార్డు

**ప్రజాశక్తి -ఆనందపురం :** మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్, హెడ్ ఇండస్ట్రీ-ఇనిస్టిట్యూట్ లింకేజ్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్, అకడమిక్ ఎక్సలెన్స్ సెంటర్ హెడ్‌గా ఉన్న డాక్టర్ పిఎస్ఇ నవీన్ ఎక్సలెన్స్ ఇన్ స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సిఎస్‌సి) ద్వారా ఎక్సలెన్స్ ఇన్ స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ అవార్డు తమకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డును తన తల్లిదండ్రులు, స్నేహితులు, ఎన్ఎస్ఆర్ఐటి బోధనా సిబ్బందికి అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నార్త్ జోన్ క్రైమ్ సిఐగా ప్రకాష్

**ప్రజాశక్తి - మధురవాడ :** నార్త్ జోన్ క్రైమ్ సిఐగా బిఎస్ఎస్.ప్రకాష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నార్త్ జోన్ పరిధిలో నేరాలు నియంత్రణకు ప్రత్యేక చర్యలు, రాత్రి పూట గస్తీ, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయనగరం పిటిసి నుంచి బదిలీపై వచ్చారు.

# కొండవాలు ప్రాంతాల్లో వణుకు

## జారిపడుతున్న రాళ్లు, మట్టి

**ప్రజాశక్తి - ఆరిలోవ :** వరుస వాయుగుండాల ఫలితంగా కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలతో కొండచరియలు విరిగిపడుతున్నాయి. గత వారం కురిసిన వర్షాలతో తడిసి ముద్దయిన కొండవాలు ప్రాంత నివాసాలు తిరిగి వాయుగుండ ప్రభావంతో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల ప్రజలు వణికి పోతున్నారు. ముఖ్యంగా హనుమంతువాక నుంచి దినదయాల్‌పురం, పాతడైరీఫారం నుంచి తోటగరువు, తోటగరువులో ఉన్న బిఎన్ఆర్‌నగర్, విశాలాక్షినగర్ ప్రజలు తుపాను వస్తే కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఎక్కడ కొండచరియలు విరిగి పడతాయోనని భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసముండే వారిలో ఎక్కువ మంది భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకొని జీవించేవారే ఉన్నారు. ఒక వైపు వర్షాలు కారణంగా కూలి పనులు లేక ఇబ్బందులు పడుతుంటే, మరో వైపు నివాసాలు ఎక్కడ జారి పడతాయోనని ఆందోళన చెందుతున్నారు.

# బురద రోడ్డుపై గిరిజనుల నిరసన

## పక్కా రహదారి నిర్మించాలని డిమాండ్

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు వీలభద్రపేట గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ గిరిజనులు శనివారం బురదగా, దమ్ముమడిని తలపించేలా ఉన్న రహదారిపై కూర్చొని నిరసన తెలిపారు. వీరి నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే గామానికి చెందిన గవ్మెల ప్రవీణ్, సూకురి చిన్నారి, గవ్మెల కావ్య ముగ్గురు చిన్నారులు అనారోగ్యానికి గురైతే రోడ్డు సౌకర్యం లేక, సకాలంలో మెరుగైన వైద్యం అందించలేకపోవడంతో మృత్యువాత పడ్డారని తెలిపారు. వీరభద్రంపేట జంక్షన్ నుండి చింతలపూడి మెయిన్ రోడ్డుకు కిలో మీటరు దూరం కనీసం గ్రావెల్ రోడ్డు అయినా వేయాలని గిరిజనులు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు సౌకర్యం కల్పిస్తే అనంతగిరి మండలం సోలుబోంగు పాటి, చినబురగ గ్రామాల్లో గిరిజనులు కష్టాలు తీరుతాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకుంటున్న పాలకులు, మిగిలిన రోజుల్లో వారి చావుకు వారిని చావనివ్వు అని వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామాలకు సైతం రోడ్లు లేక, డోలిమోతలు తప్పడం లేదని, సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి వెంటనే వీరభద్రపురం గ్రామానికి రోడు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు జె.ఈశ్వరరావు, బడ్నాల జోగులు, తామర్ల బుచ్చిబాబు, స్థానిక మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

బురద రోడ్డులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

## నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లాలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవుదినంగా ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సెలవు దినంగా పాటించాలని, ఎవరైనా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఉత్తర్వులు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**విశాఖ జిల్లాలోనూ...**

**విశాఖ కలెక్టరేట్ :** ప్రతికూల వాతావరణం, ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సోమవారం విశాఖపట్నం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లాలో వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఈ నెల 9న రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

**విశాఖ జిల్లాలోనూ...**

**విశాఖ కలెక్టరేట్ :** ప్రతికూల వాతావరణం, ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సత్కరిస్తున్న గ్రంథాలయ అధికారులు

## శ్రీనివాసరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఇటీవల ఉద్యోగ విరమణ చెందిన దేవరాపల్లి లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరావును ఆదివారం గాజువాక శాఖా గ్రంధాలయంలో విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్. వెంకట్రావు, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు, ప్రభుత్వ రీజనల్ లైబ్రేరియన్ బిఎ.పద్మావతిదేవి, రిటైర్డ్ డిప్యూటీ లైబ్రేరియన్ కె.పోతురాజు, జిల్లా ఫించనుదారుల సంఘం అధ్యక్షులు కె.త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పించనుదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాస్ పెదబయలులో గ్రంధాలయానికి పక్కాభవనం నిర్మాణానికి ఆయన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు యన్.వి నరసింహం. కె.శ్రీనివాస రావు, పాడేరు లైబ్రేరియన్ ఎం. సత్యవతి, ఎలమంచిలి లైబ్రేరియన్ ఆనందరావు, అజయ్ కుమార్, పి.వి.నూకరాజు, పివి. రమణ, వై.వెంకటేశ్వర్లు, ఎం.పద్మావతి, సూర్యకళ సునీత, మహేశ్, ఎల్‌వి రమణ, డి. కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ జీవితం నేటి తరానికి ఆదర్శం

## సంతాప సభలో సిపిఎం నాయకులు

ఆర్ఎస్ చిత్ర పటానికి నవాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని సిపిఎం నాయకులు అన్నారు. సిపిఎం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎస్ సంతాపసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆర్ఎస్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కె.రామ సదాశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం మండల కన్వీనర్ ఆర్ రాము మాట్లాడుతూ ఆర్ఎస్ మృతి ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన జీవితాంతం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. దళితులు, గిరిజనులు, రైతులు భూ సమస్యలపై సుదీర్ఘ పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటంలో భాగంగా అనేకసార్లు జైల్లో ఉన్నారని చెప్పారు. ఆయన చేసిన పోరాటాలు త్యాగాలు నేడు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బుద్ధ రంగారావు, శరగడము కనుమనాయుడు, కాంగ్రేగుల బాబురావు, ఎస్ రామనాయుడు, బి రామ్ కుమార్, చౌడిపల్లి అప్పారావు, కె సోమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోతి స్వైర విహారం

### - 15 మందికి గాయాలు

ప్రజాశక్తి -వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఒక కోతి ఆదివారం స్వైర విహారం చేసింది. కోతి చేసిన దాడిలో 15 మందికి గాయాలయ్యాయి. ఈ కోతి దొండవారి పాతమేడ వద్ద తిష్ట వేసి కనిపించిన వారిపై దాడి చేస్తుంది. గత నాలుగు రోజులుగా స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. పెద్ద వాళ్ళు చిన్నారులు ఎక్కువగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన అప్పారమ్మ, వరలక్ష్మి, రేవతి, దినేష్, లక్ష్మి తదితరులతో పాటు 15 మంది గాయపడ్డారు. వీరంతా స్థానిక పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. కోతికి భయపడి స్థానికులు ఇంటి నుండి బయటకు రాలేకపోతున్నారు.

## ఎంవిఆర్ ఆధ్వర్యాన వినాయక నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నర్సింగరావుపేటలో గణేష్ యూత్ సేవా సంఘం ఆధ్వర్యంలో వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు నేతృత్వంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నర్సింగరావుపేటలో ఎంవిఆర్ నివాసం వద్ద వినాయక మండపం ఏర్పాటు చేశారు. వేడుకలను ఎంవీఆర్ తోపాటు ఆయన తనయుడు సతీష్ బాబు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా 9 రోజులు పూజలు నిర్వహిస్తారు. ఏటా నిర్వహించేలా ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తామని ఎంవీఆర్ తెలిపారు.

వినాయకుడిని ఊరేగిస్తున్న ఎంవిఆర్ తదితరులు

# అవగాహనతో ఆత్మహత్యలను నివారించవచ్చు

## ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఎన్ఎన్.రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఆత్మహత్యలకు పాల్పడే యువతను ముందుగా గుర్తించే అవకాశం బంధువులకు, ఉపాధ్యాయులకు ఉంటుందని, అటువంటి వారిని గుర్తించినప్పుడు వారికి ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల జరిగే నష్టాల గురించి చెప్పడం, అవగాహన కల్పించడం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఎన్ఎన్.రాజు అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినం సందర్భంగా ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం, కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం సాగింది. సదస్సులో డాక్టర్ ఎన్ఎన్.రాజు మాట్లాడుతూ ప్రతి లక్ష మందిలో 12 మంది ఆత్మహత్య చేసుకొని మరణిస్తున్నారని తెలిపారు. అవగాహనతో ఈ ఆత్మహత్యలను ఆపగలమని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని సైతం అరికట్టవచ్చునన్నారు. సదస్సు కెజిహెచ్ చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి సన్మాన కార్యక్రమంతో ప్రారంభమయ్యింది. అనంతరం ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ వైఎల్.నరసింగరావు మాట్లాడుతూ ఇటువంటి అవగాహనా సదస్సుల వల్ల ఆత్మహత్యలను నివారించగలమని చెప్పారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణలో తోటి మిత్రుల సహకారం అవసరమని చెప్పారు. డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్ తన అనుభవాలను పంచుకున్నారు. కౌసల్యా కౌన్సిలింగ్ సెంటర్ నిర్దేశకులు డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇక్కడితో ఆగదని, ప్రతి ప్రాంతంలో నిర్వహించి తగిన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పద్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎన్ఎన్.రాజు

# ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

శారదానది గట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో ముంపు ముంపు గ్రామాలలో ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పర్యటించారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట, పెదపాడు, కాజీపాలెం తదితర గ్రామాలలో పొంగి ప్రవహిస్తున్న కాలువలను పరిశీలించారు. పల్లపు గ్రామాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. కాలువలకు గండి పడే ప్రమాద పరిస్థితులు ఉంటే తన దృష్టికి వెంటనే తీసుకురావాలని కోరారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు జనపరెడ్డి నర్సింగరావు, జనసేన నాయకుడు శరగడము నాగార్జున, ఖాజీపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు పీలా తులసి రాము, నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు ఉన్నారు.

**శారదానది గట్టు పరిశీలన**

**మునగపాక :** మండలంలోని గణపర్తి గ్రామం వద్ద శారద నది గట్టును ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. భారీ వర్షం కారణంగా ప్రమాదపుటంచుల్లో ఉన్న నది గండి కొట్టకుపోకుండా నియంత్రించే దిశగా అధికారులతో సమీక్షించారు. తక్షణమే గట్టును పటిష్టం చేసేందుకు తాత్కాలికంగా రూ.2 లక్షలతో ఇసుక మూటలు వేసి పటిష్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నది పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట మాజీ జడ్పిటిసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన, టిడిపి మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, కాళ్ల చంద్రమోహన్, మాజీ సర్పంచ్ కర్రి రామ నాగేశ్వరావు, రాజశేఖర్, కాంగ్రెస్ నాయకుడు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద శారదా నది గట్టును ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. శారదా నది గట్టుకు అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.

**నీట మునిగిన పంట పొలాలు పరిశీలన**

**అనకాపల్లి :** భారీ వర్షాలు కారణంగా నీట మునిగిన తుమ్మపాల, శంకరం గ్రామాల వరి పొలాలను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. మునిగిన వరి పొలాలను చూసి సంబంధిత ఇరిగేషన్ డిఈ, ఏఈ, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తక్షణమే వర్షపు నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం కూడా ముంపుకు గురవుతున్న కారణంగా రైతులు నష్టపోతున్నారని, ఇక మీదట అలా జరగకుండా ఉండాలని ఈ సమస్య పరిష్కారానికి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. వీటికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, టెలికామ్ అడ్వైజరి మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, పీలా తాతునాయుడు, శంకరం గ్రామ జనసేన అధ్యక్షుడు బొండా లక్ష్మీనారాయణ, కరణం శంకర్, కరణం రాజారావు, తోట సాయి, బొండా నాగేశ్వరరావు, కరణం కనకారావు, కరణం చందు, అగ్గాల జగన్, బొండా జస్వంత్ పాల్గొన్నారు.

పంటల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బిఐఏసీ) తన ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఆదివారం బ్రాండ్స్ ఆవరణలో 131వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 245 మందికి ఉచితంగా అద్దాలను అందించారు. 38 మందికి క్యాటరాక్ట్ సర్జరీ చేయించాలని వైద్యులు సూచించారు. శిబిరానికి వచ్చిన కంటి రోగులకు మజ్జిగ 16 భోజనం సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

**చోడవరం రూరల్ :** మండలంలోని వెంకన్నపాలెంలో శ్రీవురుకిటి పెద రామునాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 40 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించినట్లు ట్రస్టు చైర్మన్ వురిగిటి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు, మాడుగుల టిడిపి సీనియర్ నాయకులు పైల ప్రసాద్‌రావు, గ్రామ సర్పంచ్ ముల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ మురికితి రమణ, రాజు ఎడ్యుకేషన్ డెస్క్ ప్రతినిధి బూర అప్పల రాజు, జోగ వెంకట రమణ, శంకర్ ఫౌండేషన్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిమ్మరాజుపేటలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ఆదివారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. గ్రామంలో పర్యటించిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సూచించిన మేరకు గ్రామ పంచాయతీ చొరవ తీసుకొని జెసిబితో పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ శివ బాపు నాయుడు, ఎస్ నాగార్జున, కర్రి జోగి, ఎస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి- మునగపాక :** స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి వ్యాపారవేత్త ఆడారి కృష్ణ, అతని సోదరుడు కొండలరావు ఇరువురు కలిసి చెరో ఐదు లక్షల చొప్పున రూ.10 లక్షలను ఆదివారం వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటకోట ఉమామహేశ్వరరావు, బి.సూర్యనారాయణ, దాడి ముసలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, అలంక సూర్యప్రకాశరావు, కాంగ్రెస్ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదస్థాయికి చేరువలో రైవాడ

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైవాడ జలాశయం నీటి మట్టం 111 మీటర్లకు చేరి ప్రమాద స్థాయికి చేరువలో ఉందని డిఈఈ సత్యంనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం జలాశయం లోనికి సుమారు 2000 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుందని చెప్పారు. నీటి మట్టం 113 అడుగులకు చేరితే స్పిల్ వే గేట్స్ తెరచి నదిలోని నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, అనకాపల్లి, కశింకోట, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి, మొదలగు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పైన తెలియపరిచిన మండలాలకి సంబంధించి పంచాయితీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు అందరూ ప్రజలను అప్రమత్తం, చేయాలని, గ్రామాల్లో దండోరా వేయించాలని, నదీ ప్రవాహంలోకి ఎవరూ దిగరాదని హెచ్చరించాలని కోరారు. రాత్రి వేళల్లో శారద నదిలో ఎవరు దిగరాదని ఆయన తెలిపారు.

ప్రమాదస్థాయిలో ఉన్న రైవాడ జలాశయం

## రచయిత శ్రీనివాస్‌కి ఘన సన్మానం

**ప్రజాశక్తి-వడ్డాది :** బుచ్చయ్యపేట మండలం ఎల్.సింగవరం గ్రామానికి చెందిన రచయిత కలవలపల్లి శ్రీనివాస్‌ను ఆదివారం సత్కరించారు. కలవలపల్లి శ్రీనివాస్ చోడవరం ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాడు. శ్రీనివాస్ చిన్ననాటి నుండి రచనలు, కథలపై ఆసక్తి చూపించేవాడు. శ్రీనివాస్ సొసైటీ సైంటిస్ట్ (రోలర్ బిలాంక్) అనే పుస్తకాన్ని రచించాడు. ఆ పుస్తకాన్ని శనివారం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ విడుదల చేశారు. అనంతరం శ్రీనివాస్‌ను సాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీనివాస్ తనదైన ఆలోచనాత్మక వైఖరితో తోటి యువకులకు భిన్నంగా జ్ఞాన దృష్టి కలిగిన విద్యార్థిగా తనదైన శైలితో పుస్తకాన్ని రచించాడని తెలిపారు. తన మనసులో ఉన్న ఆలోచనలు అన్నిటిని ఈ పుస్తకం ద్వారా యువతకు, ప్రజలకు మార్గదర్శకులు కావాలని కోరారు. శ్రీనివాస్ మరింత లోతైన విస్తృతమైన పరిశోధన వైపుగా అతని ప్రయాణం సాగాలని కోరారు. చాలామంది సోషల్ మీడియా ఆనందంతో కొట్టు కుపోతూ అజ్ఞాలుగా మారుతున్న యువతకు ఈ పుస్తకం లావణెత్తిన ప్రశ్నలై వారి దృష్టి కోణాన్ని మార్చడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మాల్యాద్రి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, రామలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# నిండని చెరువులు

**నేటికీ కొనసాగుతున్న వరి నాట్లు**

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఎన్ని తుపాన్లు వచ్చినా మండలంలోని పలు చెరువులు నిండలేదు. ఇప్పటికే నాలుగైదు తుఫాన్లు వచ్చినప్పటికీ మండలంలోని నీరు లేక వేలవేలపోతున్న చెరువులు అనేకం ఉన్నాయి. దీంతో మండలంలో నేటికీ వరినాట్లు కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది. మండలంలోని రైవాడ జలాశయం నీరు వచ్చే వారాడ, ఏ.కోడూరు, గొండుపాలెం, రొంగలి నాయుడుపాలెం, ఏ.భీమవరం, మేడచర్ల తదితర గ్రామాల్లో మాత్రమే పూర్తిగా వరినాట్లు జరిగాయి. రైవాడ కాలువ పరిధిలో లేని మండల కేంద్రం కె.కోటపాడు, కింతాడ, గుల్లేపల్లి, చౌడువాడ తదితర గ్రామాల్లో నేటికీ కొన్నిచోట్ల వరి నాట్లు పూర్తికాలేదు. ఇప్పటికీ వరినాట్లు జరుగుతున్న గ్రామాలు ఉన్నాయి. రైవాడ జలాశయ నీటిమట్టం పెరిగిన వెంటనే గేట్లు ఎత్తి వరద నీరు శారదా నదిలోకి విడిచి పెడుతున్నారు. అలా విడిచి పెట్టే బదులు రైవాడ నుండి విశాఖ తరలించే కాలువ ద్వారా రైవాడ జలాశయ పరిధిలో లేని అన్ని గ్రామాల్లోని చెరువులు నిండే విధంగా వరద నీటిని సద్వినియోగం చేయవలసి ఉంది. కానీ ఆ దిశగా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు గాని ఎన్నడు ఆలోచించడం లేదని పలువు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆ దిశగా అధికారులు ప్రజాప్రతినిధులు ఆలోచించి వృధాగా పోతున్న వరదనీటిని మండలంలోని రైవాడ జలాశయ పరిధిలో లేని అన్ని గ్రామాలలోని చెరువులకు అందించాలని అన్ని గ్రామాల రైతులు కోరుతున్నారు.

చెరువులో అరకొరగా నీరు ఉన్న దృశ్యం

## పరవాడపాలెంలో ఇ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని పరవాడపాలెం గ్రామం పంచాయితీ కార్యాలయంలో ఈ -క్రాప్ పంట నమోదు, ఈకేవైసీ నమోదు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయడు, సూరిసెట్టి రాము, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సలాది సతీష్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ చేస్తున్న సిబ్బంది

# ఏకధాటిగా వర్షాలు

## స్తంభించిన జనజీవనం

తాళ్లపాలెం జంక్షన్‌లో భారీగా నిలిచిన వర్షపు నీరు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం తెరిపివ్వకుండా వర్షం కురవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పాడి రైతులకు పశుపోషణ కష్టంగా మారింది.పశువుల పాకలు వర్షం కారణంగా బురదమయం అయ్యాయి. దీంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లె గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా దర్శనమిస్తున్నాయి. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేశారు.

**కోటవురట్ల:**మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి కూడా ఎడతెరిపిలేని వర్షం కురుస్తుంది. దీంతో, జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునగడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. కోటవురట్ల, కొడవటిపూడి తదితర గ్రామాలలో ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం సీతారామరాజు నగర్ వద్ద చెరువు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుంది. అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కోటవురట్ల రోడ్డుపై నిలిచిన నీరు

**రాంబిల్లి** :బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో శుక్రవారం నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలోని శారదా నదితో పాటు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గత నెల రోజులుగా వేసిన వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. ఈ వర్షాలు ఇలాగే కొనసాగితే పెనుముప్పు తప్పదని రైతులు ఆందోళనలో ఉన్నారు. వర్షాల నేపథ్యంలో మత్స్యకారులను సముద్రంపై వేటకు వెళ్ళవద్దని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవిన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

వడ్డాదిలో బురదమయమైన రోడ్డు

### చెరువును తలపిస్తోన్న తాళ్లపాలెం జంక్షన్

**కశింకోట** : వర్షాల కారణంగా మండలంలోని తాళ్లపాలెం జంక్షన్ చెరువు తలపిస్తోంది. ఇక్కడ రోడ్డు ఎత్తు చేయడం, పోలీస్ చెక్ పోస్ట్ పక్కన చిన్న కాలువను లోతు చేస్తే నీరు నిల్వ ఉండదని గ్రామస్తులు అంటున్నారు. నర్సీపట్నం, అనకాపల్లి రెండు వైపులా డ్రేనేజీ వెడల్పు చేసి వర్షం నీరు పోయిలా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. కాని హైవే, ఆర్ అండ్ బి అధికారులు తూతూమంత్రంగా పరిశీలించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

### రహదారుల బురదమయం

**వడ్డాది** : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పరిసర ప్రాంతాల్లో గత మూడు రోజులుగా ఎడతెరపి లేని వాన కురుస్తుంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వడ్డాది వద్ద పెద్దేరు, విజయరామరాజుపేట వద్ద తాచేరు నదులు నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. తాచేరు వంతెనపై వాహన రాకపోకలు నిలిపివేశారు. వడ్డాది, పాడేరు నుండి వచ్చే వాహనాలను వడ్డాది బ్రిడ్జి మీదగా గౌరీపట్నం నుండి చోడవరానికి దారి మళ్ళించారు. బుదిరెడ్డిపాలెం, ఎల్.సింగవరం, బంగారు మెట్ట, విజయరామరాజుపేట వద్ద రహదారుల గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. బుదిరెడ్డిపాలెం వద్ద రహదారి బురదమయంగా మారింది.

**బుచ్చయ్యపేట** : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి చెరువులు నిండుకున్నాయి. జలాశయాల మాదిరిగా కళకళలాడుతున్నాయి. వాగుల్లో నీరు అధికంగా ప్రవహిస్తూ ఉంది. పలు గ్రామాల్లో రైతులు నాటిన వరినట్లు నీట మునిగాయి. పంట పొలాల్లో నీరు అధికంగా చేరడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-గొలుగొండ:**గత కొన్ని రోజుల నుంచి వర్షాలు ఎక్కువగా పడటంతో వాగులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తలు తీసుకోవాలని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, అవసరమైతే తప్ప ఎవరు ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. చెరువులు, నదులు, వాగులు రిజర్వాయర్ దగ్గరకు వెళ్ళవద్దన్నారు.లోతట్టు ప్రాంతాల్లో ఉంటే ముందుగానే అక్కడి నుంచి ఖాళీ చేయాలన్నారు. రైతులు ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లేవారు చెరువుల దగ్గరకు వాగులు దగ్గరకు వెళ్ళవద్దని కోరారు.వీలైనంతవరకు ప్రయాణించడం మానుకుంటే మంచిదన్నారు.

**గొలుగొండ:**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో సహాయక చర్యలు చేపట్టేందుకు వీఆర్వో, వీఆర్ఏలతో 24 గంటలు తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో సిద్ధంగా ఉన్నట్లు డిప్యూటీ తహశీల్దార్ రాజ్ భరత్ తెలిపారు. తూఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రంగా గొలుగొండ మండల పరిషత్ పాఠశాల భవనం సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తుపాన్‌తో ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే రెవిన్యూ అధికారులకు తెలియజేయాలని, సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్దంగా ఉన్నామన్నారు.

నక్కపల్లిలో కురుస్తున్న వర్షం

## అనంతగిరి ఘాట్‌రోడ్డులో..

# విరిగిపడ్డ కొండ చరియలు

### నిలిచిన వాహనాల రాకపోకలు

**ప్రజాశక్తి -అనంతగిరి:**మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో అనంతగిరి ఘాట్ రోడ్డు ఒకటో నెంబర్ మలుపు సమీపం వద్ద కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అరకు నుండి ఎస్.కోట విశాఖ, విశాఖ విజయనగరం ఎస్.కోట నుండి అరకు ప్రయాణించే వాహనాల రాకపోకలకు గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. దీంతో ప్రయాణికులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం జెసిబి సాయంతో విరిగిపడ్డ కొండ చరియలను తొలగించి రాకపోకలను యధావిధిగా కొనసాగించారు.



జెసిబితో చేపడుతున్న తొలగింపు పనులు

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా సుబ్బన్న

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నర్సీపట్నంకి చెందిన మీసాల సుబ్బన్నను నియమిస్తూ అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. సుబ్బన్న గతంలో డిసిసి అధ్యక్షునిగా పనిచేశారు. మరల ఆయనకు అవకాశం కల్పించడం పట్టణ పిసిసి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

మంటలను ఆర్పుతున్న సిబ్బంది

## హార్డ్‌వేర్ షాపులో విద్యుదాఘాతం

### రూ.30 లక్షల ఆస్తి నష్టం

**ప్రజాశక్తి-కొత్తకోట:**రావికమతం మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం హార్డ్వేర్ దుకాణంలో చోటు చేసుకున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సుమారు రూ 30 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన దాచేపల్లి రామారావు ( నానాజీ ) కి చెందిన దుకాణంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ ఘటన సంభవించింది. దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెల రేగిన నిప్పు రవ్వలకు దుకాణంలోని పెయింట్ డబ్బాలకు నిప్పంటుకొని మంటలు చుట్టుముట్టాయి. జోరున వర్షం కురుస్తున్నప్పటికీ దుకాణం లోని రెండు అంతస్తులలో పెయింట్లు, పీవీసీ పైపులు, తదితర వస్తువులకు నిప్పంటుకొనడంతో పెద్ద ఎత్తులో మంటలు ఎగసిపడ్డాయి. దుకాణంలో ఉన్న వెల్డర్ భయంతో పై అంతస్తులో చిక్కుకు పోగా పక్క నున్న బిల్డింగు నుంచి నిచ్చెన సహాయంతో అతనిని కాపాడారు. ప్రమాదం జరిగిన భవనంలోకి ప్రవేశించి అతన్ని బయటకు తీసుకొచ్చారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే రావికమతం ఎస్సై ధనుంజయ నాయుడు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రావికమతం, చోడవరం అగ్రిమాపక కేంద్ర శకటాల సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## ఫ్లూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**ప్రస్తుతం విస్తరిస్తున్న ఫ్లూ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైయస్సార్ హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యనిపుణులు శ్రీకాంత్ సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ సీజన్లో ఫ్లూ జ్వరం ఎక్కువగా విస్తరిస్తుందని, నర్సీపట్నం పరిసర ప్రాంత చిన్న పిల్లల్లో ఎక్కువగా ఈ జ్వరాలు కనబడుతున్నాయని తెలిపారు. నోటు నుండి తుమ్మినప్పుడు ఫ్లూ కారకం వ్యాప్తి చెంది ఫ్లూ జ్వరం వ్యాప్తికి దారితీస్తుందని, మాస్క్ ధరించాలని ఆయన అన్నారు. జ్వరం 102 నుండి 103 డిగ్రీల వరకు జ్వరం ఉంటుందని, రొంప, గొంతు నొప్పి, వాంతులు, విరోచనాలు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఏడాదిలోపు నుండి ఐదు సంవత్సరాలు పైబడిన వారు, పెద్దలకు కూడా ఫ్లూ జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. తినేటప్పుడు చేతులు శుభ్రం చేసుకుని తినాలన్నారు. ముందుగా టీకాలు వేయించుకోవడం మంచిదని సూచించారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

## త్వరితగతిన డైవర్షన్ రోడ్డు పనులు

**ప్రజాశక్తి- కోటవురట్ల:**రామచంద్రపురం వద్ద బ్రిటిష్ కాలంలో నిర్మించిన మైనర్ వంతెన జీర్ణావస్థకు చేరుకొని కృంగి పోవడంతో ఆదివారం రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ వంతెనను పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే వంతెన నిర్మాణానికి అంచనాలను రూపొందించామని రెండు కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు ఇచ్చేందుకు 15 లక్షలు అవుతుందని, పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. వంతెన తీవ్రస్థాయిలో బలహీనంగా ఉందని భారీ వాహనాలను నిషేధించడంతోపాటు రెండు రోజులపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడ నున్నందున సమీపప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై రమణయ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఈ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాలకు జివిఎంసి ఏర్పాట్లు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:**వినాయక చవితి పర్వ దినం సందర్భంగా నగరంలోని సముద్ర తీర ప్రాంతాల్లో పలుచోట్ల వినాయక విగ్రహాలను ప్రజలు నిమజ్జనం చేసేందుకు గానూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లను చేశామని జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు వినయ్ కుమార్, అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. మహా విశాఖ నగర పరిధిలో 1,2,3,4,6,7 జోన్లలో నది, సముద్రతీర ప్రాంతాలలో వినాయక నిమజ్జనాలకు ఈనెల 7వ తేదీ నుండి 17వ తేదీ వరకు నలుగురు పర్యవేక్షక ఇంజినీర్ల నిరంతర పర్యవేక్షణతో 13 చోట్ల భీమిలి బీచ్, మంగమారిపేట బీచ్, గోస్తనీ నది పాత వంతెన,చిల్ల పేట చెరువు,జోడిగుల్లపాలెం బీచ్,సాగర్ నగర్ బీచ్, విఐటి జంక్షన్ బీచ్,యారడ, నరవ,పెదజాలరిపేట,నావల్ క్యాంటీన్ బీచ్ పాయింట్ , అప్పికొండ , శారదా ఘాట్ ప్రదేశాల్లో వినాయక నిమజ్జనాలకు సంబంధించి అవసరమగు టెంట్లు , పగోడాలు, పండల్స్ , మైక్ అనౌన్స్మెంట్ సిస్టమ్స్ తదితర సదుపాయం, నిమజ్జనంకు 7 క్రేన్లను ఏర్పాట్లను చేశామని తెలిపారు. విజయవాడ వరద ముంపు ప్రాంతాలకు పారిశుధ్య కార్మికులు జీవీఎంసీ నుండి తరలి వెళ్లిన నేపథ్యంలో అదనంగా 650 మందిని ఏర్పాటు చేశామని తెలిపారు.

## గౌరీ సొసైటీ సేవలు అభినందనీయం

-ఎమ్మెల్యే పి.గణబాబు

**ప్రజాశక్తి.-విశాఖ కలెక్టరేట్:** ది శ్రీ గౌరీ కో- ఆపరేటివ్ సొసైటీ సేవల్లో ఎప్పుడూ ముందుంటుందని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు కొనియాడారు. ఆ సంస్థ 27వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రైల్వే న్యూ కాలనీలోని హెరిటల్ కృష్ణా టవర్స్‌లో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన గణబాబు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంచి ఆర్గనైజేషన్లకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి వాటిలో గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ ముందు వరుసలో ఉంటుందన్నారు.

బ్యాంక్ చైర్మన్ చదరం డివివి ప్రసాద్ మాట్లాడుతూ, తమ బ్యాంకులో అతివేగంగా రుణాలు మంజూరు చేస్తామని, సీనియర్ సిటిజన్ కు ఆరు శాతం ఎక్కువ వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. ఏటా మాదిరి ఈ సంవత్సరం కూడా సభ్యులకు 16 శాతం డివిడెండ్ అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ ఆడారి నూకరాజు, ట్రెజరర్ కం మేనేజింగ్ డైరెక్టర్ ఆడారి సత్యనారాయణ, డైరెక్టర్లు ఆళ్ల వెంకటేశ్వరరావు, మాదేటి అప్పారావు, పీలా జోజి బాబు, ఎంవి ఎస్ఎస్ మూర్తి,శరగడం సత్యనారాయణ, ఎంవిబిఎన్ సత్యనారాయణ,, పెంటకోట సంజీవరావు నాయుడు,వై. రాజేశ్వరరావు,వై. కొండలరావు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీల్లో..రాణిస్తున్న బాక్సర్లు

## పలు పతకాలు కైవశం -నర్సీపట్నానికి మంచి గుర్తింపు -బాక్సింగ్ రింగ్ లేక అవస్థలు

సాధన చేస్తున్న బాక్సర్లు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**జాతీయ స్థాయిలో ఆడి పతకాలను నర్సీపట్నం క్రీడాకారులు సాధిస్తున్నారు. నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో బాక్సింగ్‌లో జాతీయ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన వారు ఉన్నారు. వీరిలో బొగ్గు మౌనిక యూరోప్‌లో మెడల్ సాధించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించింది. ఆల్ ఇండియా ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కేరళ, ఇలా 10 రాష్ట్రాలకు పైగా 12 నేషనల్ పోటీల్లో పాల్గొన్నారు.

అలాగే నాగ మౌనిక సీనియర్ జూనియర్, సబ్ జూనియర్ ఆల్ ఇండియా ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కేరళ, ఇలా 6 రాష్ట్రాలకు పైగా 7 నేషనల్ లో పాల్గొని పాటియాలాలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఎన్ఐఎస్ కోచ్ కోర్సు కూడా చేసింది. కోలుకుల కృష్ణవేణి ఆల్ ఇండియా ఆల్ ఇండియా ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కేరళ, మధ్య ప్రదేశ్, అస్సాం ఇలా 8 రాష్ట్రాలకు పైగా 10 నేషనల్ పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించింది. బంతు మౌనిక ఆల్ ఇండియా ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కేరళ, మణిపూర్ ఇలా 7 రాష్ట్రాలకు పైగా ఆల్ ఇండియా నేషనల్ 8 టోర్నమెంట్ లో పాల్గొంది. బాలేపల్లి కృష్ణారావు ఆల్ ఇండియా ఢిల్లీ, చండీఘడ్, తమిళనాడు ఇలా 4 రాష్ట్రాలకు పైగా సీనియర్ జూనియర్ 5 నేషనల్ లో పాల్గొన్నాడు. స్పోర్ట్స్ అథారిటీ ఇండియా వారి ఎన్ఐఎస్ కోచ్ కోర్సు ఢిల్లీ, పాటియాలాలో చేసారు. వేపాడ ప్రియాంక ఆల్ ఇండియా నేషనల్ 6 ఆల్ ఇండియా పంజాబ్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, కన్యాకుమారి ఇలా ఆరు రాష్ట్రాలకు పైగా టోర్నమెంట్ లో పాల్గొంది. అలాగే స్పోర్ట్స్ అథారిటీ ఇండియా వారి ఎన్ఐఎస్ కోచ్ కోర్సు ఢిల్లీ, పాటియాలాలో కూడా చేసింది. మునికోటి లోవ లక్ష్మి లాశిని హర్యానా, ఢిల్లీలలో 3 నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంది. బొమ్మల రాజ రాజేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ కర్ణాటక చెన్నైలలో 3 నేషనల్‌లో పాల్గొన్నారు. గండి జ్యోతి ప్రభుత్వ మెయిన్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ హర్యానాచ కేరళ కన్యాకుమారి హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు 5 నేషనల్‌లో పాల్గొనగా, రవి కుమార్ ట్రైబల్ బాక్సర్ సీనియర్ 2 నేషనల్‌లో కర్ణాటక చెన్నైలో పాల్గొన్నారు. యర్రా తేజస్విని 6 నేషనల్‌లో ఢిల్లీ, హర్యానా చెన్నై, కర్ణాటక పంజాబ్‌లో 6 నేషనల్ లో ఖేలో ఇండియాలో పాల్గంది. ఎ.లక్ష్మి తేజస్విని సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఇంటర్ చదువుతూ నేషనల్ స్కూల్ గేమ్స్ ఢిల్లీలో పాల్గొంది. అలాగే ఇంకా రంగా రామ్ 4 నేషనల్, నవ్య 3 నేషనల్, బి.గంగోత్రి 3 నేషనల్, పి.ప్రవల్లిక 2 నేషనల్, ఎల్.సమంత 2 నేషనల్, కె.హర్షిత 1 నేషనల్ కె.శ్రీను నేషనల్, సిహెచ్..సంతోష్, పి. వెన్నెల ఇలా ఇంకా 26 మంది కి పైగా నేషనల్ లో మన నర్సీపట్నం నుండి వారి ప్రతిభ చూపారు. శాప్ కోచ్ ఆబ్బు స్పోర్ట్స్ అథారిటీ నుండి సెంటర్ రావడంతో బాక్సింగ్‌ను చాలా బాగా అభివృద్ధి చేసారు. కానీ సరైన క్రీడా ప్రాంగణం లేక క్రీడా పరికరాలు లేక స్టేడియం గ్రౌండ్‌లో పిక్కలు రాళ్ళు గోతులలో పడి దెబ్బలు తగులుతూ ఇబ్బంది పడుతూ కూడా బాక్సర్లు వారి సత్తా చూపుతున్నారు.

ఇక్కడ బాక్సింగ్ చేయడానికి రింగ్ లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. రింగ్ పై ట్రైనింగ్ చేస్తే కాంపిటీషన్‌లో రింగ్ పై భయం పోయి ఫ్రీగా చేయగలుగుతారు. నర్సీపట్నంలోనే రింగ్ ఉంటే ఇక్కడ ఏజెన్సీకి ముఖ ద్వారం అయిన నర్సీపట్నంలో ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి ఒలింపిక్ కు కూడా వెళ్ళ గలిగె నైపుణ్యం ఉన్న వారు ఉన్నారు.

# ఆకట్టుకున్న గణనాథులు

విశాఖ నగరంలో వినాయక చవితి వేడుకల సందర్భంగా పలు ప్రాంతాల్లో విభిన్న ఆకృతుల్లో గణనాథులు కొలువుదీరారు. పెన్సిల్ మల్లుపై షికారు చేస్తున్న వినాయకుడు, గొడుగునీడన ఉన్న గణనాథుడు, ప్రభాష్, అల్లు అర్జున్ నమూనాలతో కూడిన వినాయకుని విగ్రహాలు ఆకట్టుకున్నాయి. మండపాలను నిర్వాహకులు వినూత్నంగా తీర్చిదిద్దారు. గిటార్ మండపం ఆకట్టుకుంది.

పెన్సిల్‌పై గణనాథుడు

సుందరంగా గణేషుడు

వాయిద్యాలు వాయిస్తూ...

గిటార్‌లో గణపతి

గొడుగు నీడన గణపతి

సాంప్రదాయ విఘ్నేశ్వరుడు

తాబేలు రూపంలో..

ప్రభాస్ సినీ గెటప్‌లో గణపయ్య